BHARATH SAMACHAR DIGITAL

28, అక్టోబర్ 2026, బుధవారం భారత్ సమాచార్

రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు





భారత్ సమాచార్, మెదక్ జిల్లా: పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు IPS శిబిరాన్ని ప్రారంభించడంతో పాటు స్వయంగా రక్తదానం చేసి ఇతరులకు స్ఫూర్తినిచ్చారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా స్పందించారు. మొత్తం 108 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి ఈ కార్యక్రమం ద్వారా సహాయం అందించే అవకాశం కలిగింది.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం ఒకరి ప్రాణాలను కాపాడే గొప్ప సేవా కార్యక్రమమని తెలిపారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ఇతర వైద్య పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యంగా ఉన్నవారు రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని, అర్హత ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు రక్తదానం చేయాలని సూచించారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం అవసరంలో ఉన్నవారికి ప్రాణదానం చేసే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు.



రక్తదాతలకు ఎస్పీ అభినందనలు

రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 108 మంది దాతలను ఎస్పీ అభినందించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా మానవత్వం, సేవాభావం చాటుకున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగనాథ్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఎస్ఐలు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా చైర్మన్ తిరుమలేష్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొని రక్తదాన శిబిరం విజయవంతానికి సహకరించారు.

© 2026 Bharath Samachar